క్లుప్తంగా

పారిశుధ్యం, పన్ను వసూళ్ల లక్ష్యం సాధించాలి



జూలపల్లిలో కార్యదర్శులతో ఎంపీడీవో సమావేశం

జూలపల్లి: గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్యం, పన్నుల వసూళ్ల లక్ష్యం సాధించడంతోపాటు ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులు ఫీజులు చెల్లించేందుకు కార్యదర్శులు కృషి చేయాలని ఎంపీడీవో పద్మజ సూచించారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అన్ని రకాల రికార్డులను అప్‌డేట్ చేయడంతోపాటు నర్సరీల నిర్వహణ, 2024–25 బడ్జెట్ తయారీ, జీపీడీపీ ప్లాన్, ఎంపీడబ్ల్యూలకు ఇన్సూరెన్స్ కల్పించడం, సెల్ టవర్ల సమాచారం సేకరించాలని ఆదేశించారు. ఎంపీవో అనిల్‌రెడ్డి, ఏపీవో సదానందం, కార్యదర్శులు పాల్గొన్నారు.

అభివృద్ధికి సహకరించాలి



పన్ను వసూలు చేస్తున్న మున్సిపల్ కమిషనర్ నియాజ్

సుల్తానాబాద్: మున్సిపల్ పరిధిలోని ప్రజలందరూ ఇంటి పన్నులు చెల్లించి అభివృద్ధికి సహకరించాలని సుల్తానాబాద్ మున్సిపల్ కమిషనర్ మహ్మద్ నియాజ్ అన్నారు. ఇంటి పన్నులు, నల్లా బిల్లులు, ట్రేడ్ లైసెన్స్ ఫీజులతోపాటు ఇతర పన్నులు చెల్లించాలని, నిర్లక్ష్యం వహించకుండా 100 శాతం పన్నులు వసూలు చేయాలని సిబ్బందిని ఆదేశించారు.

రాయితీని సద్వినియోగం చేసుకోవాలి

మంథని: ప్రభుత్వం ప్రకటించిన ఎల్ఆర్ఎస్ రుసుము 25 శాతం రాయితీని సద్వినియోగం చేసుకోవాలని మంథని మున్సిపల్ కమిషనర్ మనోహర్ కోరారు. 2020 సంవత్సరంలో ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్న ప్లాటు యజమానులు ఈనెల 31 లోగా పూర్తి ఫీజు చెల్లించి 25 శాతం రాయితీ పొందాలని, ప్లాట్లను క్రమబద్ధీకరించుకోవాలన్నారు. 9014609713 హెల్ప్‌లైన్ నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి



జూలపల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల

జూలపల్లి: ఈనెల 5 నుంచి 22 వరకు జరిగే ఇంటర్ మొదటి, రెండో సంవత్సరం పరీక్షల నిర్వహణకు జూలపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ప్రిన్సిపాల్ విశ్వప్రసాద్ చెప్పారు. ఇప్పటికే విద్యార్థులకు హాల్ టికెట్ల పంపిణీ పూర్తి కాగా.. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలతోపాటు పెద్దాపూర్‌లోని ఆదర్శ విద్యాలయం, తెలుకుంట కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం విద్యార్థులు మొత్తం 510 మంది పరీక్షలకు హాజరు కానున్నట్లు తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరం 270, ద్వితీయ సంవత్సరం 240 మంది విద్యార్థులకు అవసరమైన సీటింగ్, మౌలిక వసతులు కల్పించినట్లు వివరించారు.

దరఖాస్తు చేసుకోండి

గోదావరిఖనిటౌన్: కాకతీయ యూనివర్సిటీ దూరవిద్య అడ్మిషన్లకు ఈనెల 25 చివరి తేదని దూరవిద్య కేంద్ర డైరెక్టర్ ఆచార్య బి.సురేశ్‌లాల్ ఒక ప్రకటనలో తెలిపారు. దూరవిద్యలో డిగ్రీ, పీజీ, డిప్లొమా, లైబ్రరీ సైన్స్, మాస్టర్ ఆఫ్ జర్నలిజం, హెచ్ఆర్ఎం, సైకాలజీ, డిప్లొమా ఇన్ కంప్యూటర్స్, యోగా, పీజీలో సైన్స్ కోర్సుల్లో అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. డిగ్రీ, పీజీ అడ్మిషన్లు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో కూడా చేసుకోవచ్చని పేర్కొన్నారు. గోదావరిఖని సింగరేణి ఉద్యోగులు, ఎన్టీపీసీ, ఆర్ఎఫ్‌సీఎల్ ఉద్యోగులకు మంచి అవకాశమన్నారు. మరిన్ని వివరాలకు గోదావరిఖని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఫోన్ నంబర్ 8341385000లో సంప్రదించాలని కోరారు. మంచిర్యాల, లక్సెట్టిపేట, శ్రీరాంపూర్, మందమర్రి, పెద్దపల్లి, సుల్తానాబాద్, మంథని అభ్యర్థులు కూడా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

'ఎమ్మెల్యేను విమర్శిస్తే సహించం'

పాలకుర్తి: రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్‌ను విమర్శించే స్థాయి బీఆర్ఎస్ నాయకుడు హరీశ్‌రెడ్డికి లేదని, ఎమ్మెల్యేపై ఆరోపణలు చేస్తే సహించేది లేదని పాలకుర్తి మండల మాజీ ఎంపీపీ గంగాధర రమేశ్ అన్నారు. సోమవారం జయ్యారంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. విదేశాల్లో విలాసవంతమైన జీవితం అనుభవిస్తున్న హరీశ్‌రెడ్డికి ఎమ్మెల్యే, ఆయన సతీమణి మనాలిఠాకూర్‌ను విమర్శించే నైతిక హక్కు లేదన్నారు. నాయకులు పాల్గొన్నారు.

కష్టం ఎక్కువ.. ఫలితం తక్కువ

- ఫామ్‌పాండ్స్ తవ్వకాలతో గిట్టుబాటు కాని కూలి
- వేసవి అలవెన్సును ఎత్తేసిన కేంద్రం



పాట్యాలలో ఫామ్‌పాండ్స్ తవ్వకాల్లో ఉపాధి కూలీలు

రామగుండం: వర్షాకాలంలో కురిసిన భారీ వర్షాలతో వరద నీటిని ఒడిసిపట్టుకొని వినియోగించుకునేందుకు ప్రభుత్వ భూములను గుర్తించి ఫామ్‌పాండ్స్ తవ్వకాలను చేపడుతోంది. ఫలితంగా పాండ్స్‌లో ఉన్న నీటిని వేసవికాలంలో వ్యవసాయ అవసరాలతోపాటు పశువుల దాహార్తి తీర్చేందుకు వినియోగిస్తారు. ఇందులో భాగంగా ఈనెల 31 లోగా గ్రామాల్లోని ప్రభుత్వ భూముల్లో విరివిగా ఫామ్‌పాండ్స్ తవ్వకాలను చేపట్టాలని కేంద్రం ఆదేశించింది. ఈ నేపథ్యంలో గ్రామాల్లో ఫామ్‌పాండ్స్ తవ్వకాలతో జోరుగా కూలీలు ఉపాధి పొందుతున్నారు.

అంతర్గాం మండల పరిధిలోని అంతర్గాం, టీటీఎస్ అంతర్గాం, పాట్యాల, పెద్దంపేట, ఎగ్లాస్‌పూర్, మద్దిర్యాల, ముర్మూర్, ఎల్లంపల్లి గ్రామాల్లోని ప్రభుత్వ భూముల్లో ఫామ్‌పాండ్స్ తవ్వకాలతో కూలీలు ఉపాధి పొందుతున్నారు. సదరు భూములు సొడు భూములు కావడంతోపాటు గట్టిగా ఉండడంతో ఉపాధి కూలీలు తవ్వకాలతో అలసిపోతున్నారు. ప్రత్యామ్నాయంగా ఇతర పనులు చూపించాలని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గ్రామాల్లో వ్యవసాయ భూములకు వెళ్లే ఫార్మేషన్ రోడ్లు(మట్టి రోడ్లు), పశువుల పాక నిర్మాణాలు, ఫామ్‌పాండ్స్ గుంతల తవ్వకాలు, గడ్డివాముల షెడ్డు నిర్మాణం తదితర పనులు మార్చి 31 లోగా చేపట్టాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలో గ్రామాల్లో అత్యధికంగా ఫార్మేషన్ రోడ్లు, ఫామ్‌పాండ్స్ ఉపాధి పనులు కొనసాగుతున్నాయి. ఫార్మేషన్ రోడ్డు క్యూబిక్ మీటర్ రూ.284, ఫామ్‌పాండ్ క్యూబిక్ మీటర్ రూ.300 కూలి చెల్లిస్తారు.

గిట్టుబాటు కావడం లేదు



ఫామ్‌పాండ్స్ తవ్వే భూములు పూర్తిగా సొడు భూములు కావడంతో గడ్డపారకు తెగడం లేదు. ఒకవేళ తెగినా తక్కువ పరిమాణంలోనే తెగుతంది. వెడల్పు, లోతు, అడ్డం, పొడవు క్యూబిక్ మీటర్ తవ్వడం అసాధ్యంగా మారడంతో కూలి గిట్టుబాటు కావడం లేదు.

– ఉప్పులేటి లస్మమ్మ, ఉపాధి కూలి

మూడేళ్ల క్రితం..



మూడేళ్ల క్రితం ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్, మే మాసంలో ప్రతినెల 25 శాతం అదనంగా వేతనంలో ఎండాకాలం అలవెన్సుగా చెల్లించేవారు. ఇప్పుడు ఎండాకాలం అలవెన్సును ఎత్తేయడంతో ప్రస్తుతం ఉన్న ఎండలకు దేహంలో సత్తువ లేక చేసే పనికి కూలి గిట్టుబాటవడం లేదు.

– బోండ్ల రాజమ్మ, ఉపాధి కూలి

కేంద్రం ఆదేశాల మేరకు..



కేంద్రం ఆదేశించిన విధంగా దశలవారీగా ఉపాధి కూలీలకు పనులను అప్పగిస్తాం. తాము సొంతంగా పనులు అప్పగించే అవకాశముండదు. మార్చి చివరి వరకు ఫామ్‌పాండ్స్, ఫార్మేషన్ రోడ్లు, పశువుల పాకలు తదితర పనులు చేపట్టాలని ఆదేశాలందాయి.

– బైరి వేణుమాధవ్, ఇన్‌చార్జి ఎంపీడీవో, అంతర్గాం

పద్మశాలీ మహాసభను జయప్రదం చేయాలి



సుల్తానాబాద్‌లో పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

సుల్తానాబాద్: హైదరాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఈనెల 9న జరిగే పద్మశాలీ సంఘం మహాసభను జయప్రదం చేయాలని పద్మశాలీ సంఘం జిల్లా అడ్‌హక్ కమిటీ చైర్మన్ వల్స నీలయ్య అన్నారు. సోమవారం మండల కేంద్రంలో పద్మశాలీ సంఘం భవనం వద్ద పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. నాయకులు బూర్ల లక్ష్మీనారాయణ, దీకొండ భూమేశ్, పెగడ చందు, రామచంద్రం, రవి, పరశురాం, రాజేంద్రప్రసాద్, తిరుమల్‌దాస్, గోలి శ్రీనివాస్, భాస్కర్, పాండు, లచ్చన్న, రవీందర్, మల్లన్న, సంపత్, నారాయణ, చంద్రమౌళి, శ్రీనివాస్, శంకర్, కొండ మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

ఎలిగేడు: ఈనెల 9న హైదరాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో జరిగే పద్మశాలీ మహాసభను విజయవంతం చేయాలని వల్స నీలయ్య కోరారు. మండల కేంద్రంలోని పద్మశాలీ సంఘం భవనంలో పోస్టర్ ఆవిష్కరించారు. తెలంగాణ ప్రాంత పద్మశాలీ సంఘం ప్రచార కార్యదర్శి బర్ల లక్ష్మీనారాయణ, మండల అధ్యక్షుడు రమేశ్, నాయకులు గ్యాజంగి లక్ష్మణ్, దూడం వీరేశం, కుసుమ వెంకటేశం, రాజమౌళి, శ్రీనివాస్, రాజేశం, కైలాసం తదితరులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలి



మంత్రికి వినతిపత్రం అందిస్తున్న సమ్మయ్య

పాలకుర్తి: మండల పరిధిలో పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని జీడీనగర్ మాజీ సర్పంచ్, డీసీసీ ప్రధాన కార్యదర్శి సూర సమ్మయ్య రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబును కోరారు. సోమవారం తెలంగాణ సచివాలయంలో మంత్రిని కలిసి పలు సమస్యలపై వివరించారు. స్థానిక నిరుద్యోగ యువత కోసం స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని, పాలకుర్తి మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల లేక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, నూతనంగా కళాశాల ఏర్పాటు చేయాలని కోరారు. మంథని నియోజకవర్గ పరిధిలోని జీడీనగర్‌లో మినీ కమ్యూనిటీ హాల్, మహిళా సమైక్య భవనం, జీడీనగర్ నుంచి బసంత్‌నగర్ వరకు రహదారి వెడల్పుతోపాటు సెంట్రల్ లైటింగ్‌ను ఏర్పాటు చేయాలన్నారు. రాతపూర్వకంగా వినతిపత్రం సమర్పించారు.

విద్యార్థులకు అవగాహన సదస్సు



అవగాహన కల్పిస్తున్న షీటీం సభ్యులు

గోదావరిఖనిటౌన్: రామగుండం సీపీ ఎం.శ్రీనివాస్ ఆదేశాల మేరకు షీటీం ఇన్‌చార్జి ఎస్ఐ లావణ్య ఆధ్వర్యంలో స్థానిక అశోక్‌నగర్‌లోని జెడ్పీహెచ్ఎస్ ఉర్దూ మీడియం పాఠశాల విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో షీటీం మెంబర్ స్నేహలత మహిళల భద్రత, ఆన్‌లైన్ మోసాలు, డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. వేధింపులకు గురైన మహిళలు సెల్ నంబర్ 6303923700కు ఫోన్ చేసి లేదా 100కి డయల్ చేసి సమస్యలు తెలపాలని చెప్పారు. వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. ఆన్‌లైన్ మోసాలకు గురైతే 1930కి సమాచారమందించాలని తెలిపారు. షీటీం సభ్యులు మౌనిక, సురేశ్, పాఠశాల హెచ్ఎం భవాని, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వీధి దీపాలు ఏర్పాటు



14వ డివిజన్‌లో వీధి దీపాలు ఏర్పాటు చేస్తున్న అధికారులు

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 14వ డివిజన్ పరిధిలోని లక్ష్మీపురం, ఎల్కలపల్లిగేట్, వీర్లపల్లి, చైతన్యపురికాలనీలో రామగుండం నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో సోమవారం వీధి దీపాలు ఏర్పాటు చేశారు. డివిజన్‌లో వీధి దీపాలు తక్కువ సంఖ్యలో ఉండడంతో 14వ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు బూర్ల శ్రీనివాస్ రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కన్‌సింగ్ వినతిపత్రం అందించగా.. స్పందించిన ఎమ్మెల్యే డివిజన్‌కి 15 విధి దీపాలు మంజూరు చేశారు. రామగుండం నగరపాలక సంస్థ అధికారులతో మాట్లాడి వీధి దీపాల సమస్య పరిష్కారానికి కృషి చేసిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

కార్మిక సమస్యలు పరిష్కరించాలి



గోదావరిఖని: ఆర్ఎఫ్‌సీఎల్ కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని మజ్దూర్ యూనియన్ అధ్యక్షుడు అంబటి నరేశ్ డిమాండ్ చేశారు. స్థానిక ప్రెస్ క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. యాజమాన్యం కార్మికుల సమస్యలపై దాటవేత ధోరణి సరికాదన్నారు. ప్రస్తుతం యూరియా ఉత్పత్తి కీలకమైనా సమస్యలపై దృష్టి సారించకపోవడం శోచనీయమన్నారు. ఈనెల 6న నిర్వహించే సమావేశంలో కార్మికుల సమస్యలను యాజమాన్యం పరిష్కరించకపోతే నిరవధిక సమ్మె నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు. నాయకులు కొండ్ర రూపేశ్, మారం తిరుపతి, గుడికందుల సతీశ్, మనుక మధుకర్, తిప్పని రాంకీ, మర్రి శ్రావణ్, రావుల సురేశ్, ఆవుల రాకేశ్, మిట్ట వేణు, భైర రాకేశ్, ఆకుల రమేశ్, బండి అశోక్, పల్లె శ్రావణ్, సారం సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ బ్రోచర్ ఆవిష్కరణ



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ విష్ణువర్ధన్ తదితరులు

రామగిరి: జేఎన్టీయూ హైదరాబాద్‌కు అనుబంధంగా ఉన్న బీ–జోన్ స్థాయి క్రికెట్ టోర్నమెంట్ బ్రోచర్‌ను సోమవారం మంథని జేఎన్టీయూ కళాశాల ప్రిన్సిపాల్ బి.విష్ణువర్ధన్ ఆవిష్కరించారు. మార్చి 6 నుంచి లీగ్ కం నాకౌట్ పద్ధతిలో నిర్వహిస్తున్న టోర్నమెంట్‌కు గతంలో కళాశాలలో చదువుతూ క్రికెట్ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన విద్యార్థులు, కళాశాల యాజమాన్యం ఆర్థిక సాయం అందజేస్తున్నారన్నారు. ఉమ్మడి ఖమ్మం, వరంగల్, కరీంనగర్ జిల్లాలకు చెందిన జేఎన్టీయూ హైదరాబాద్ యూనివర్సిటీ అనుబంధ ఇంజినీరింగ్, ఫార్మసీ, ఎంబీఏ, ఎంసీఏ విద్యార్థులు పాల్గొంటారని, బయటి కళాశాలల జట్లకు ఉచితంగా భోజనం, వసతి సౌకర్యం కల్పిస్తున్నామని తెలిపారు. పరిపాలనాధికారి సుమన్, ఫిజికల్ డైరెక్టర్లు కృష్ణారెడ్డి, సునీల్, నిర్వాహకులు కార్తీకేయ, నిఖిల్, విద్యార్థులు పాల్గొన్నారు.

తాగునీరు అందించండి

సుల్తానాబాద్: పట్టణంలోని శ్రీరామ్‌నగర్‌కు తాగునీరు ఇప్పించాలని ముస్లిం సంఘ నాయకుడు హకీమ్ మున్సిపల్ అధికారులను కోరారు. రంజాన్ మాసం సందర్భంగా తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడాలని కలెక్టర్‌తో సహా పలువురిని కోరుతున్నా నీరు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పైపులైన్ లీకేజీ మరమ్మతు చేసి నీరు అందజేస్తామని మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ నియాజ్ తెలిపారు.

ఎన్‌సీడీ సర్వే వేగవంతం చేయాలి



సుల్తానాబాద్: దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులను గుర్తించడంతోపాటు ఆన్‌లైన్ చేయాలని గర్రెపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెచ్ఈవో మహమ్మద్‌ఖాజా అనుసోద్దీన్ అన్నారు. సోమవారం యాదవనగర్‌లోని ఆయుష్మాన్ భారత్ సెంటర్‌ను సందర్శించారు. ఎన్‌సీడీ సర్వే వేగవంతం చేసి సకాలంలో పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. వైద్యారోగ్య శాఖ సిబ్బంది ఉన్నారు.

కనీస వేతన జీవోల కోసం ఉద్యమం



మాట్లాడుతున్న భూపాల్

జ్యోతినగర్/రామగుండం: కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతన జీవోలు అమలు చేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్ అన్నారు. కనీస వేతనం రూ.26 వేలు నిర్ణయించాలన్నారు. ఎన్టీపీసీ ప్రాజెక్టు లేబర్ గేట్‌తోపాటు రామగుండంలోని రైల్వే డిపో వద్ద సోమవారం నిర్వహించిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2006 నుంచి 2012 మధ్య కనీస వేతన జీవోలకు సవరణ చేశారని, చివరిసారి టీఆర్ఎస్ ప్రభుత్వం 2021లో కొన్నింటిని సవరించినా ఇప్పటికీ అమలుకు నోచుకోలేదన్నారు. ఐదేళ్లకోసారి జీవోలను సవరించాల్సి ఉండగా, 12ఏళ్లు గడిచినా ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. టీఆర్ఎస్ ప్రభుత్వం మా దిరిగానే కాంగ్రెస్ ప్రభుత్వం కూడా పరిశ్రమల యజమానులకు ప్రయోజనాలు కలిగించడం కో సమే పని చేస్తున్నాయని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తన చెప్పుచేతుల్లో ఉండే ఐఎన్టీయూసీ నేత జనక్‌ప్రసాద్ చైర్మన్‌గా కనీస వేతనాల సలహా మండలి బోర్డు ఏర్పాటు చేశారని, పోరాడే సీఐటీయూకు అందులో ప్రాతినిధ్యం కల్పించలేదని దుయ్యబట్టారు.



గోదావరిఖనిటౌన్: స్థానిక మార్కండేయకాలనీలోని కృష్ణవేణి పాఠశాల ఎదుట స్థానికులు చెత్త వేయడంతో పాఠశాల విద్యార్థులు అనారోగ్యానికి గురవుతున్నారని పాఠశాల యాజమాన్యం, విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుక్కలు, పందులు, దోమలు కారణంగా విద్యార్థులు పలు అనారోగ్య సమస్యలకు గురవుతున్నారన్నారు. మున్సిపల్ యాజమాన్యం చెత్తను తొలగించకుండా నిర్లక్ష్యం వహిస్తోందని అన్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి స్థానికులు పాఠశాల ఎదుట చెత్త వేయకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 97053 46608, 98499 71500

సింగరేణి వార్తలు

అన్ని భారీ యంత్రాల్లో ఏసీలు ఏర్పాటు చేయాలి



వినతిపత్రం అందిస్తున్న శంకర్‌నాయక్

గోదావరిఖని: వేసవి కాలం మొదలైన క్రమంలో అన్ని భారీ యంత్రాల్లో ఏసీలు ఏర్పాటు చేయాలని ఐఎన్టీయూసీ ఆర్జీ–2 ఉపాధ్యక్షుడు బదావత్ శంకర్‌నాయక్ అన్నారు. సోమవారం ఓసీపీ–3 ప్రాజెక్టు సైటాఫీస్‌ను సందర్శించి కార్మికుల సమస్యలపై మాట్లాడారు. ఓసీపీ–3 కార్మికులు సమస్యలతో ఇబ్బంది పడుతున్నారని, సమస్యలు పరిష్కరించడం ద్వారా ఉత్పత్తి కూడా పెరుగుతుందన్నారు. డంపర్ల సస్పెన్షన్లు పూర్తిగా దెబ్బతిన్నందున యంత్రాల్లో కుదుపులు పెరిగి నడుం నొప్పుల పాలవుతున్నారని అన్నారు. దీంతో కార్మికులు క్రమం తప్పకుండా డ్యూటీలు చేయలేకపోతున్నారన్నారు. హాలేజ్ రోడ్డు కూడా పూర్తి దెబ్బతిని దుమ్ము, ధూళి పెరిగిపోయిందని అన్నారు. ప్రతి భారీ యంత్రానికి ఏసీలు నడింపించేలా చూడాలన్నారు. 60 టన్నుల డంపర్ల పార్కింగ్ యార్డులో రెస్ట్ షెల్టర్లను ఏర్పాటు చేయడంతోపాటు డస్ట్ క్లీనర్ల యంత్రాన్ని సైతం ఏర్పాటు చేయాలని అన్నారు. డ్రిల్ ఆపరేటర్లకు సంబంధించి డ్రిల్లులకు అన్ని విధాలా మరమ్మతు చేయించడంతోపాటు వారికి ట్రాన్స్‌పోర్టు వాహనాల కొరత లేకుండా చూడాలన్నారు. అన్ని డంపర్లకు షెడ్యూల్ ప్రకారం వాటర్ సర్వీసింగ్ చేయించాలని అన్నారు. టెక్నీషియన్లకు సరిపడా టూల్సును అందించాలని, వేసవి కాలంలో ట్రిప్‌మెన్లకు సరిపడా రెస్ట్ షెల్టర్లను ఏర్పాటు చేయాలన్నారు. గని మేనేజర్‌కు భరత్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. నాయకులు అక్రం, దశరథం గౌడ్, ఐరెడ్డి సంపత్‌రెడ్డి, భీముని సత్యనారాయణ, కొక్కిరాల శ్రీనివాస్, సాలిగామ మల్లేశ్, కొంగర రవీందర్, ఆకుల రాజయ్య పాల్గొన్నారు.

యూనియన్ ముసుగులో కార్మికులపై వేధింపులు

గోదావరిఖని: యూనియన్ ముసుగులో కార్మికులను వేధిస్తున్న ఓసీపీ–3 సీహెచ్‌పీ అధికారులపై చర్య తీసుకోవాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం సీహెచ్‌పీ సైటాఫీస్ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో కార్మికులనుద్దేశించి మాట్లాడారు. ఐఎన్టీయూసీకి చెందిన సదరు ఇంజినీర్ ఫోర్‌మెన్ షిఫ్ట్ కార్మికులను తమకనుకూలంగా లేరనే సాకుతో వేధింపులకు గురి చేస్తున్నాడన్నారు. అధిక పనిభారం మోపుతూ ప్లేడేలు, ఓటీలు కట్ చేస్తున్నాడని అన్నారు. కార్మికులను మానసికంగా, ఆర్థికంగా దెబ్బతీసేలా యూనియన్ నాయకుడు వ్యవహరిస్తున్నాడన్నారు. తమ యూనియన్ కండువాలు కప్పుకున్న వారికే ఓటీలు, ప్లేడేలు రాస్తూ వంత పాడుతున్నాడని అన్నారు. సూపర్‌వైజర్ వేధింపులు భరించలేక ఆ షిఫ్ట్ కార్మికులు డ్యూటీలకు దుమ్మా కొడుతున్నారన్నారు. సదరు నాయకుడిపై అనేకసార్లు ఫిర్యాదు చేసినా యాజమాన్యం చర్యలు తీసుకోలేదని అన్నారు. ఇప్పటికైనా ఆర్జీ–2 జీఎం చొరవ తీసుకొని ఓసీపీ–3 సీహెచ్‌పీలో జరుగుతున్న వ్యవహారంపై విచారణ జరిపి బాధ్యులపై చర్య తీసుకోవాలని కోరారు. రాజారత్నం, జిగురు రవీందర్, అన్నారావు పాల్గొన్నారు.

కారు బోల్తా.. ఒకరికి గాయాలు



పొలంలో కారు



గాయపడ్డ శ్రీనివాస్‌రెడ్డి



నుజ్జునుజ్జయిన బైక్

రామగిరి: మంథని–పెద్దపల్లి ప్రధాన రహదారి కల్వచర్ల ఎల్లమ్మ ఆలయం సమీపంలో సోమవారం కారు అదుపు తప్పి బోల్తా పడింది. రామగిరి పోలీసుల వివరాల ప్రకారం.. సెంటినరికాలనీకి చెందిన దూస్స సాత్విక్ తన వ్యక్తిగత పనుల నిమిత్తం పెద్దపల్లికి వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా.. కల్వచర్ల బొక్కల వాగు సమీపంలో అదుపు తప్పి పక్కన ఉన్న పొలంలో పడిపోయింది. కారులో నలుగురు ప్రయాణిస్తుండగా.. కారు నడుపుతున్న సాత్విక్‌కు గాయాలయ్యాయి. సంఘటనా స్థలాన్ని ఎస్సై చంద్రకుమార్ పరిశీలించారు.

కారు, బైక్ ఢీ.. వ్యక్తికి తీవ్ర గాయాలు

రామగిరి: ఎదురెదురుగా వస్తున్న కారు, బైక్ ఢీకొన్న ఘటనలో బైక్ నడుపుతున్న వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఎలక్ట్రికల్ బైక్ నుజ్జునుజ్జయింది. స్థానికుల వివరాల ప్రకారం.. కల్వచర్ల గ్రామానికి చెందిన అల్లిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి అలియాస్ శ్రీధర్‌రెడ్డి తన పొలం పనుల నిమిత్తం తన ఎలక్ట్రికల్ వాహనంపై వెళ్తుండగా మంథనికి చెందిన కారు ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొట్టింది. బైక్‌పై ఉన్న శ్రీనివాస్‌రెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే కమాన్‌పూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా.. ప్రథమ చికిత్స అందించి పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. మెరుగైన వైద్య చికిత్స కోసం కరీంనగర్‌కు తరలించారు. సంఘటనా స్థలాన్ని ఎస్సై చంద్రకుమార్ పరిశీలించి వివరాలు సేకరించారు.

రాజీ మార్గమే రాజమార్గం

యైటింక్లయిన్‌కాలనీ: రాజీ మార్గమే రాజమార్గమని గోదావరిఖని టూటౌన్ సీఐ ఎస్.ప్రసాదరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 8న జాతీయ లోక్ అదాలత్ ఉందని, ఈ అవకాశాన్ని వినియోగించుకొని పలు రకాల కేసులను రాజీ మార్గంలో పరిష్కరించుకోవాలని కోరారు. సమయం, డబ్బు ఆదా అవడమే కాక సత్వర పరిష్కారం లభిస్తుందని అన్నారు.